


21న ఐదు సాగునీటి ప్రాజెక్టు కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని ఐదు సాగునీటి ప్రాజెక్టు కమిటీలకు ఈనెల 21న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు ఫారమ్ 2 సి ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. డెంకాడ ఆనకట్టు సిస్టమ్, డెంకాడ, ఆంధ్ర రిజర్వాయర్ ప్రాజెక్టు, ఆంధ్ర, తాటిపూడి రిజర్వాయర్ ప్రాజెక్టు, తాటిపూడి, పారాది ఆనికట్ట, పారాది, మడ్డువలస గొర్లె శ్రీరాములనాయుడు రిజర్వాయర్ ప్రాజెక్టు స్టేట్-1కు ఎన్నికలు నిర్వహిస్తారు. ఆరోజు ఉదయం 9 నుంచి 12.30 వరకు జరిగే ఈ ఎన్నికల ప్రక్రియలో, ఇటీవల సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొని, తమ ప్రాజెక్టు కమిటీకి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకుంటారు. ఈ ఎన్నికలకు సూపరింటెండెంట్ ఇంజినీర్, ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు, ఇద్దరు ప్రత్యేక ఉప కలెక్టర్లను ఎన్నికల అధికారులుగా నియమించారు.

అన్నదాతల్లో గుబులు



భోగాపురం పొలాల్లో ఉన్న వరిచేను దిబ్బలు

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. నూర్పులు ఉధృతంగా సాగుతున్న సమయంలో వర్షాలు కురవడంతో అన్నదాతల్లో గుబులు రేగుతోంది. జిల్లాలో వచ్చే నాలుగు రోజులో కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో మరింత కలవరపడుతున్నారు. మంగళవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై వర్షాలు ప్రారంభమయ్యాయి. బుధవారం పలుచోట్ల అక్కడక్కడా స్వల్ప వర్షం పడింది. మరోవైపు తీవ్ర చలిగాలులు వీచాయి. వర్షాలు పడుతుండడంతో పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు నిమగ్నమయ్యారు. పొలాల్లో ఎండబెట్టడం కోసం ఉంచిన ధాన్యాన్ని ఇళ్లకు తరలిస్తున్నారు. ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రజాశక్తి-బొబ్బిలి/పూసపాటిరేగ/భోగాపురం

అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. చాలాచోట్ల వరి కోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల పంట కోసి కుప్పలుగా వేశారు. జిల్లాలో ముమ్మరంగా నూర్పులు చేపడుతున్నారు. వర్షాలు పడతాయన్న వార్తల నేపథ్యంలో పంటను కాపాడుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 2.45లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 403 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో పలు మండలాల్లో ధాన్యం అమ్మేందుకు రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఇప్పటివరకు సుమారు లక్షా 20వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు.ఇటీవల కురిసిన వర్షాలకు 1934 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిచిపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. మళ్లీ అల్పపీడనం రావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

బొబ్బిలి మండలంలో లోతట్టు పొలాల్లో ఉన్న వరి పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించి తడవకుండా టార్పాలిన్‌లతో కప్పుతున్నారు. ఇప్పటికే నూర్పిడి చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.



బొబ్బిలిలో కళ్లాల్లో ఉన్న వరిచేనుపై టార్పాలిన్లు కప్పిన రైతులు

- జిల్లాలో పలుచోట్ల స్వల్ప వర్షాలు
- నాలుగు రోజుల పాటు వానలు పడతాయని హెచ్చరిక
- రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేసిన అధికారులు
- సముద్రంలో అల్లకల్లోలం
- వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు అధికారుల సూచన

వర్షాలు కురిస్తే పంటకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అల్పపీడనంతో సముద్రం అల్లకల్లోలం

అల్పపీడనంతో పూసపాటిరేగ మండలంలోని తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. తుపానుగా మారే అవకాశం ఉండటంతో మత్స్యకారులు తమ బోట్లను ఒడ్డుకు చేర్చుతున్నారు. సముద్రంలో లంగర్ వేసుకున్న బోట్లను మరింత పటిష్టంగా లంగర్ వేశారు. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తమయ్యారు.

లోతట్టు ప్రాంతాలను గుర్తించి వరదలు వస్తే వాటి నుండి రక్షణ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో మత్స్య కారులు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తీరంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటన జరగకుండా జాగ్రత్త వహించాలని రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ గోవింద ఆదేశాలు జారీ చేశారు.

భోగాపురం మండల తీర ప్రాంత గ్రామాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. దీంతో మత్స్యకారులు తమబోట్లను ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. మరోవైపు, నూర్పులు వేగవంతమైన సమయానికి వర్షాలు పడడంతో రైతులు నూర్పులు నిలిపివేశారు. సుమారు 20రోజులు కిందట కోసిన వరిచేనును పొలాల్లోనే గాలి దిబ్బలు వేసి వదిలేశారు. వాటిని కప్పేందుకు టార్పాలిన్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.



పూసపాటిరేగ : చింతపల్లిలో బోటుకు లంగరు వేస్తున్న మత్స్యకారులు



జ్యోతి వెలిగించి షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీనటి శ్రీలీల; జ్యూయలరీ విభాగాన్ని ప్రారంభిస్తున్న శ్రీలీల, ఎమ్మెల్యే

శ్రీలీల సందడి

చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం

నగరంలోని ఎన్‌సిఎస్ థియేటర్ సమీపంలో నిర్మించిన చెన్నై షాపింగ్ మాల్‌ను బుధవారం ప్రముఖ సినీ నటి శ్రీలీల, స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ వినియోగదారులకు అవసరమైన అన్ని రకాల వస్త్రాలు, బంగారం, వెండి వస్తువులు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని, ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో షాపింగ్‌మాల్ ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీలీలను చూసేందుకు అధిక సంఖ్యలో జనం విచ్చేశారు.

- ప్రజాశక్తి, విజయనగరం



శ్రీలీలను చూసేందుకు వచ్చిన జనంతో కిక్కిరిసిన రోడ్డు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా

విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యా రంగంలో సమస్యల పరిష్కారానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న కె.విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యుటిఎఫ్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో విజయగౌరి బయోడేటా పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయ గౌరి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలోను ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహించాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ రెండు మీడియంలు ప్రవేశపెట్టాలని , పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని పోరాటం చేస్తామని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జెఆర్‌సి పట్నాయక్ మాట్లాడుతూ నిరంతరం ఉపాధ్యాయ సమస్యలపై పనిచేస్తున్న విజయగౌరిని గెలిపించుకోవడం ఎంతయినా అవసరమని అన్నారు. జిల్లా కార్యదర్శులు ఎం.సత్యనారాయణ, సిహెచ్ తిరుపతి నాయుడు, నాయకులు ఆర్‌ఎవి సూర్యారావు, జి.రాజారావు, అల్లు శంకరరావు, పి రాంప్రసాద్, జి గంగాధర్, పి.రామకృష్ణ, వి.లక్ష్మణరావు పాల్గొన్నారు.



విజయగౌరి బయోడేటా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పేదల భూ సమస్యలను పరిష్కరించాలి

రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-గుర్ల

పేదలు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై దృష్టి సారించి, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. గుర్ల మండలం దేవునికణపాకలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలనుంచి వచ్చిన వినతులను కలెక్టర్ పరిశీలించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని గిరిజన రైతులు చాలా ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలిచ్చి తమను హక్కుదారులను చేయాలని కోరారు. అలాగే కొంతమందికి పట్టా ఉన్నప్పటికీ, భూమిని అప్పగించలేదని కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, ఆ భూమికి సంబంధించిన వివరాలను ఆరా తీశారు. గ్రామంలోని సమస్యను తాహశీల్దార్ ఆదిలక్ష్మి వివరించారు. పేదలు సాగు చేసుకుంటున్న భూముల వివరాలు, భూమి స్వాధీనంలో ఉండీ పట్టాలు లేనివారు, పట్టాలున్నప్పటికీ భూమి అనుభవంలో లేనివారి జాబితాలను రూపొందించి క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం, వారంలోగా తమకు అందజేయాలని ఆదేశించారు. భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అర్హులకు భూములిచ్చి, పట్టాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చిన వినతుల్లో అవకాశం ఉన్నవాటిని తక్షణమే పరిష్కరించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు ఇద్దరు రైతుల పాస్ పుస్తకాలను అప్పటికప్పుడే మార్చి, వచ్చిన వినతుల్లో రెండింటిని అప్పటికప్పుడే పరిష్కరించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఉన్న స్థల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. సదస్సులో తాహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, వ్యవసాయాధికారి ఎ.తిరుపతిరావు, డిప్యూటీ తాహశీల్దార్ పి.నారాయణమ్మ, మండల సర్వేయర్ బి.శివ, ఆర్ఐ దుర్గా ప్రసాద్, సర్పంచ్ పివి సూర్యనారాయణరాజు, ఇతర మండల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న గ్రామస్తులు

పాలసేకరణ ధర పెంచకపోతే పోరాటం ఉధృతం

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు

ప్రజాశక్తి-బొబ్బిలి

విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాలు ధరను పెంచకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. స్థానిక గంటి ప్రసాదం భవనంలో పాలు ధర పెంచాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల సంరక్షణకు ఖర్చు పెరిగినప్పటికీ విశాఖ డెయిరీ యాజమాన్యం పాల ధర పెంచకుండా తగ్గించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. తగ్గించిన పాలు ధరను పెంచి లీటర్ పాలుకు రూ.5 ప్రోత్సాహకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డెయిరీ లాభాల్లో పాడి రైతులకు బోనస్ ఇవ్వాలన్నారు. పాలు ధర పెంచకపోతే పోరాటం ఉదతం చేస్తామన్నారు. పాలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్.ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ డెయిరీని కంపెనీ చట్టం నుంచి సహకార రంగంలోకి మార్చాలని డిమాండ్ చేశారు. లీటర్ ఆవు పాలకు రూ.50, గేదె పాలకు రూ.80 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ విశాఖలో పాలు పోస్తున్న ప్రతి రైతుకూ మెంబర్ గా ఇవ్వాలని, నాణ్యమైన దాణా ఇవ్వాలని కోరారు. పాడి రైతుల పోరాటానికి మద్దతు ఇస్తామని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్ము నాయుడు, ఇఫ్టూ జిల్లా నాయకులు ఎం.గోపాలం, రైతు సంఘం నాయకులు యు.ప్రసాద్, సాంబయ్య అన్నారు.

విశాఖ డెయిరీ అక్రమాలపై దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

విశాఖ డెయిరీ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోటలో హౌస్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే బేబినాయనకు రైతు సంఘం, పాల రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు, పాల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్.ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ డెయిరీ సహకార రంగం నుంచి కంపెనీ చట్టంలోకి మారిన తర్వాత డెయిరీలో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. యాజమాన్యం అక్రమాలతో రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ఆవు పాల సేకరణ ధర తగ్గించడంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. డెయిరీ అక్రమాలపై ప్రభుత్వం వేసిన హౌస్ కమిటీ సభ్యులు సమగ్ర విచారణ చేసి కంపెనీ చట్టం నుంచి సహకార రంగంలోకి డెయిరీని తీసుకు రావాలని కోరారు. అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని బేబినాయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సురేష్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మర్రాపు సూర్యనారాయణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో 2019 లో ఏర్పాటు అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇప్పటి వరకు సొంత భవనంలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సొంత భవనం కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ అన్నారు. స్థానిక ఎల్‌బిజి భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యల నగరమైన విజయనగరంలో పేద విద్యార్థులు విద్యను అభ్యసించే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేకపోవడం అన్యాయమని అన్నారు. తరగతి గదులు లేక విద్యార్థులకు ఒక పూట మాత్రమే తరగతులు నిర్వహించడంతో , కోర్సులు పూర్తి అవ్వక అరకొర చదువులు సాగుతున్నాయని విమర్శించారు. కళాశాల తరగతులు సంస్కృత కళాశాలలో నిర్వహిస్తున్నారని, దీంతో అటు సంస్కృత కళాశాల విద్యార్థులకు, ఇటు డిగ్రీ కళాశాల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని విమర్శించారు. తక్షణమే ఖాళీగా ఉన్న అర్ అండ్‌బి అతిథి గృహం స్థలంలో డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని, ఆ కళాశాలలో చదివే విద్యార్థులకు ఆదర్శ డిగ్రీ కళాశాల తరహాలో హాస్టల్స్ కూడా నిర్మించాలని డిమాండ్ చేశారు. భవనం నిర్మాణం అయ్యేవరకు తాత్కాలికంగా అయినా నగరంలో ఏదైనా అద్దె భవనంలో తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను నెరవేర్చే విధంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం ఈ డిమాండ్లను నెరవేర్చని యెడల పెద్ద ఎత్తున పోరాడుతామని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. రాము, సి హెచ్ వెంకటేష్ మాట్లాడుతూప్రభుత్వం స్పందించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి చిన్న బాబు, జె .రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా జాతీయస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 20 నుండి 26 వరకు కేరళలో జరగనున్న 27వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలికల సెపక్‌తక్రా పోటీలకు గంట్యాడ కెజిబివి పాఠశాల విద్యార్థులు కుమ్మరి అశ్విని (9వ తరగతి), గండిముని పవిత్ర మతంగా) విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి ఈనెల 15 వ తేది నుండి 19వ తేదీ వరకు ఉరవకొండలో శిక్షణా శిబిరం నిర్వహిస్తారు. వీరికి ఒలింపిక్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు, సెపక్‌తక్రా అసోసియేషన్ కార్యదర్శి ఎంటి రాజేష్, సైక్లింగ్ అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు, పిఇటి పి.భవాని తదితరులు అభినందించారు.

రేపు మన్యంలో పవన్ కల్యాణ్ పర్యటన?

నేడు సన్ రే రిసార్ట్స్‌లో బస

ప్రజాశక్తి-భోగాపురం/విజయనగరం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈనెల 20న మన్యం జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిసింది. భోగాపురం మండలం సవరవల్లి సమీపంలోని సన్ రే రిసార్ట్స్‌లో గురువారం రాత్రి బస చేయనున్నారు. శుక్రవారం సన్‌రే రిసార్ట్సు నుంచి సాలూరు మండలం సిరివర లేదా కురుపాం మండలం కీడవాయి గ్రామానికి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిసింది. అధికారులు ఈయన విడిదికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీస్ యంత్రాంగం కూడా బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది. డిఎస్‌పి శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం రిసార్ట్‌ను పరిశీలించారు.

నేడు ఉపాధ్యాయ ఉద్యోగోన్నతికి ధ్రువపత్రాలు పరిశీలన


ప్రజాశకి-విజయనగరం టౌన్

మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతికి గురువారం ధ్రువ పత్రాలు పరిశీలన జరుగుతుందని డిఇఒ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు డిఇఒ కార్యాలయానికి హాజరు కావాలన్నారు. మున్సిపాలిటీలో 4 తెలుగు స్కూల్ అసిస్టెంట్, నగర పాలక సంస్థ లో సోషల్ 3 పోస్టులకు ఉద్యోగోన్నతుల ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

రైతులకు టార్పాలిన్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున రైతులు పండించిన ధాన్యం తడవకుండా ఉండేందుకు ప్రభుత్వం అందజేస్తున్న టార్పాలిన్లను ఎమ్మెల్యే పి. అదితి విజయలక్ష్మి గజపతిరాజు బుధవారం రాకోడు గ్రామంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు, జొన్నవలస ఎంపిటిసి పి. రాజేష్ బాబు, పినవేమలి టిడిపి నాయకులు కనకల రాంబాబు, మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.



టార్పాలిన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

మెడికవర్ ఫ్యామిలీ కార్డుతో ప్రత్యేక సేవలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ద్వారా రోగులకు వైద్య సేవల్లో రాయితీలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఫ్యామిలీ కార్డును బుధవారం కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ మేనేజ్‌మెంట్ డాక్టర్ కె.తిరుమలప్రసాద్, సెంటర్‌హెడ్ ఎన్.మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. ఈ స్కీం ద్వారా 500 రూపాయలకు ఒక కార్డును ఏడాది పాటు ఐదుగురు సభ్యులు పొందవచ్చునని, ఒపి సేవలపై 25శాతం, టెస్టులపై 15 శాతం, ఇన్‌పేషెంట్, డేకేర్ సేవలపై 10శాతం తగ్గింపు ఉంటుందని తెలిపారు బీమా రోగులకు వైద్యేతర సేవలపై 50శాతం తగ్గింపు, రూ.5వేలు కంటే ఎక్కువ ఉన్న ఫార్మసీ సింగిల్ బిల్లుపై 20 శాతం తగ్గింపు ఉంటుందని డాక్టర్ తిరుమల ప్రసాద్ తెలిపారు.



కార్డును ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఆస్పత్రి వైద్యులు

ఎస్‌పి వకుల్‌కు డిజిపి ప్రశంసలు

లోక్ అదాలత్‌లో 5345 కేసులు పరిష్కరించి రాష్ట్రంలో రెండో స్థానం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈనెల 14న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 5345 కేసులను పరిష్కరించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిన జిల్లా పోలీసుశాఖను డిజిపి అభినందించారు. ఈ నేపథ్యంలో ఈనెల 18న విజయవాడలోని డిజిపి కార్యాలయంలో ఎస్‌పి వకుల్ జిందాల్‌తో పాటు భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, డిసిఆర్‌బి ఎస్ఐ కే.రాజేష్, నెల్లిమర్ల హెడ్‌కానిస్టేబులుకె.సన్యాసి నాయుడు, 2వపట్టణ కానిస్టేబులు ఐ.శ్రీనివాసరావు ను రాష్ట్ర డిజిపి సిహెచ్. ద్వారకా తిరుమలరావు ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను, ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదై, లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అర్హత కలిగిన కేసులను ముందుగా గుర్తించి, ఆయా కేసుల్లో ఫిర్యాదు దారులు , కక్షిదారుల మధ్య సమన్వయం సాధించేందుకు క్షేత్ర స్థాయిలో చక్కని ప్రణాళితో పని చేసామన్నారు. న్యాయస్థానాల విలువైన సమయాన్ని ఆదా చేయడంతోపాటు, స్వల్ప వివాదాలు, క్షణికావేశంపై నమోదైన కేసుల్లో ఇరు వర్గాలను న్యాయస్థానం ముందు హాజరుపర్చి రాజీపడినట్లుగా వెల్లడించడంతో 5345 కేసులను పరిష్కరించామన్నారు. ప్రథమ స్థానంలో కర్నూలు జిల్లా, తృతీయ స్థానంలో కృష్ణా జిల్లాలు నిలిచాయని తెలిపారు.



ఎస్‌పికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డిజిపి ద్వారకా తిరుమలరావు

నగర పాలక సంస్థకు మరో అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగరపాలక సంస్థ సిగలో మరో రాష్ట్ర అవార్డు సింగారించుకోనుంది. ఇంధన పొదుపు విషయంలో సంస్థ చేసిన విశేష కృషికి గుర్తింపు గా సిల్వర్ అవార్డుకు ఎంపిక అయింది. రాష్ట్ర ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు (సెకా 2024) పేరిట సిల్వర్ అవార్డును ఆంధ్రప్రదేశ్ ఇంధన పొదుపు మిషన్ విజయనగరం నగరపాలక సంస్థకు ప్రకటించింది. ఈనెల 20న విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ అవార్డును అందుకోనున్నారు. రాష్ట్రంలో 123 పురపాలక, నగరపాలక సంస్థల కేటగిరిలో జరిగిన ఎంపికకై తాడిపత్రి పురపాలక సంఘం గోల్డ్ అవార్డుకు ఎంపిక కాగా, విజయనగరం నగరపాలక సంస్థకూ సిల్వర్ అవార్డు వరించింది.

సుప్రీంకోర్టు ఉత్తర్వుల పట్ల హర్షం

భోగాపురం : ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు మేరకు తొలగించిన హెల్త్ అసిస్టెంట్ లను తిరిగి నియమించుకోవాలని బుధవారం సుప్రీం కోర్టుజారీ చేసిన ఉత్తర్వులపట్ల ఎపిఎన్‌జిఒ తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆరోగ్య ఉప కమిటీ శిక్షణ ప్రారంభం

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్య ఉప కమిటీ శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘాలలో ఆరోగ్య కమిటీలను గుర్తించి వారికి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు ఆధీనంలో రెండు రోజులు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణలో హెూమ్ సీడ్ ఫుడ్ ప్రొడక్షన్ గూర్చి, వాతావరణంలో వచ్చిన మార్పులు గూర్చి, ఫుడ్ బాస్కెట్ గురించి, ఇనిస్టూట్ లింకేజ్ గ్రామ సంఘాలు గురించి, గ్రామ సంఘాలలో ప్రకృతి వ్యవసాయం అనుసంధానంలో ఏ విధమైన మార్పులు తెచ్చుకోవచ్చును అనే అవసరాల గురించి వివరిస్తారన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఎన్.వెంకటసత్యం, హెచ్ఎంఎస్ఆర్పిఎన్ఎఫ్ఎ శోభ, హెచ్ఎన్ఎంటి సరోజినీ, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు. ఎఒ యశ్వంత్ కుమార్, మండల ఆర్‌వైఎస్ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర గ్రామాభివృద్ధే లక్ష్యం

బొండపల్లి: సుస్థిర గ్రామాభివృద్ధి లక్ష్యంగా అందరూ భాగస్వామ్యం కావాలని ఎంపిపి చల్ల చలంనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిషత్ భవనంలో ఎంపిడిఒ జి.గిరిబాల అధ్యక్షతన పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మండల స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ఉద్దేశ్యాలను చేరుకున్నప్పుడే సుస్థిర గ్రామాభివృద్ధి లక్ష్యాన్ని చేరుకోవడం జరుగుతుందని అన్నారు. ఎంపిడిఒ జి.గిరిబాల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రణాళిక బద్ధంగా గ్రామాభివృద్ధి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎఒ తులసీనాద్, ఇఒపిఆర్‌డి రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కారాడలో పొలం పిలుస్తోంది

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి శ్యామసుందర్ మాట్లాడుతూ రబిలో మొక్కజొన్న పంటలో వివిధ దశల్లో చేపట్టవలసిన కార్యక్రమాలు గురించి వివరించారు. ప్రధానంగా మొక్కజొన్న దిగుబడులని శాసించే అంశమైన కలుపు నివారణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మొక్కజొన్నలో వచ్చే కత్తెర పురుగు నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎరువులు యజమాన్యంపై రైతులకు వివరంగా విశిదీకరించారు. అధిక దిగుబడి ఏ విధంగా సాధించవచ్చు అనే అంశంపై రైతులకు ఆయన వివరించారు.

పశువుల షెడ్ల నిర్మాణాలు వేగవంతం

బాడంగి: పశువుల షెడ్లు నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపిడిఒ శంబంగి రామకృష్ణ కోరారు. బుధవారం తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పశువుల షెడ్లు, గొర్రెల షెడ్లు నిర్మాణం వేగవంతం చేయాలని, ఉపాధి పని దినాలను మెరుగు పరచాలని, సకాలంలో బిల్లు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. పనుల్లో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎపిఒ విజయలక్ష్మి, ఇసిలు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించని కుళాయి కనెక్షన్లు కట్

బొబ్బిలి: కుళాయి పన్నులు చెల్లించని కనెక్షన్లను మున్సిపల్ అధికారులు కట్ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశాలు మేరకు కుళాయి పన్ను చెల్లించని కనెక్షన్లు గుర్తించి బుధవారం ఆర్ఒ నాగరాజు, ఆర్ఐ సురేష్ సమక్షంలో సిబ్బంది తొలగించారు. కుళాయి పన్ను సకాలంలో చెల్లించాలని ప్రజలను కోరారు. ఆస్తిపన్ను, కుళాయి పన్నులు బకాయి ఉంటే కుళాయి కనెక్షన్ కట్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌమార దశలో పిల్లలకు సలహాలు అవసరం

మెరకముడిదాం: కౌమార దశలో ఉన్న బాలబాలికలకు వారి భవిష్యత్తు పై సరైన సలహాలు ఇచ్చి మంచి నిర్ణయాలు తీసుకునేలా వారిని తయారు చేసే బాధ్యత మన అందరిపైన ఉందని ఎంపిడిఒ జి. భాస్కరరావు తెలిపారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కిశోర వికాసంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 నుంచి 19 సంవత్సరాల వయసులో ఉన్న పిల్లలకు సరైన అవగాహన కల్పించి భవిష్యత్‌లో బాగుండే విధంగా చూడాలని, బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి ఎం.రాజేశ్వరి, పర్య వేక్షకులు శ్రీ.శ్రీదేవి, లక్ష్మి, నాగమణి, మంగ తదితరులు పాల్గొన్నారు.

తిమిడిలో సోలార్ పవర్ కెమెరాలు

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి గ్రామంలో సిఐ వేచాలపు నారాయణమూర్తి ఆదేశాల మేరకు బుధవారం రెండు చోట్ల సోలార్ పవర్ నిఘా కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ వబ్బిన త్రినాధమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పదాల ధర్మారావు, మాజీ సర్పంచ్ బద్ద స్వామినాయుడు, యువ నాయకులు వబ్బిన సతీష్, పిళ్ల నాగరాజు, ఏడువాక వెంకటరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

బొబ్బిలి: సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బేబినాయన బుధవారం కోటలో పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన పిన్నింటి బ్రహ్మాజీకు రూ. 1.84లక్షలు, రామభద్రపురం మండలం, కొండకెంగువ గ్రామానికి చెందిన కర్తల మహేష్‌కు రూ.45వేలు, బొబ్బిలి మండలం, కోమటిపల్లికి చెందిన ఆవాల మోహన సాయిక్రిష్ణకు రూ.38,629, తెర్లాం మండలం, బూరిపేట గ్రామానికి చెందిన బి.అర్జునరావుకు రూ.25వేలు చెక్కులను ఆయన అందజేశారు. పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి ఎంతో దోహదం చేస్తుందని బేబినాయన అన్నారు.

అనధికార నిర్మాణాలు తొలగింపు

విజయనగరం టౌన్: అనధికార నిర్మాణాలు, ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్న తాత్కాలిక బడ్డీలను ప్రణాళిక సిబ్బంది బుధవారం తొలగించారు. దాసన్నపేటలోని ప్రధాన జంక్షన్‌లో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. వాస్తవానికి మంగళవారం దాసన్నపేటలో వాటర్ ట్యాంక్ వద్ద అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని ప్రణాళిక సిబ్బంది తొలగించి నిర్మాణ సామగ్రిని తరలించారు. అయినా సదరు ఆక్రమితదారుడు మళ్లీ నిర్మాణం చేపడుతున్నట్టు ఫిర్యాదు రావడంతో కమిషనర్ ఆదేశాలతో ప్రణాళిక సిబ్బంది అక్కడకు వెళ్లి మరల ఆ నిర్మాణాన్ని అడ్డుకున్నారు.

యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ లీకేజ్ పనులు


బాలాజీ మార్కెట్ ప్రాంతంలో ఉన్న ప్రధాన జంక్షన్‌లో పైప్ లైన్ లీకును గుర్తించిన కమిషనర్ పల్లి నల్లనయ్య తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. బొబ్బాది పేటలో లీకును సరి చేశారు. గోశాల వద్ద వాల్వ్ ఏర్పాటు నిమిత్తం తవ్వే ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో డిఇ మణికుమార్, వాల్వ్ ఆపరేటర్లు, ఎమినిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

గనుల అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ తనిఖీలు

రాజాం: ప్రాంతీయ నిఘా, అమలు అధికారి బి. ప్రసాదరావుకు మాంగనీస్ ఖనిజం అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రాజాం మండలం లోని గార్రాజు చీపురుపల్లి గ్రామం వద్ద విజిలెన్స్ అధికారులు, సిబ్బంది , జిల్లా గనులు-భూగర్భ శాఖ అధికారులు రాజాం మండల రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆప్రదేశంలో అక్రమ మైనింగ్ చేస్తూ పొక్లైనర్‌తో తవ్వి ట్రాక్టర్ తో రవాణా చేస్తుండగా అధికారులు ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేశారు. దీనికి కారకులు అయిన చింతగుంటి డిల్లేశ్వరరావు, తోట జోషఫ్ మరియు బురాడ సురేశ్ లపై క్రిమినల్ కేసును రాజాం స్టేషన్‌లో నమోదుచేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అదికారులు డి.సతీశ్ కుమార్ సిఐ ఎం. సురేశ్ కుమార్, గనులు భూగర్భ శాఖ అధికారులైన డిడి సి. మోహనరావు, ఆర్ఐ ఎస్. రాంబాబు ఆర్ఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ నిఘా అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ మాంగనీస్ ఖనిజాన్ని ఎవరైనా అక్రమంగా తవ్వడం గాని, రవాణా చేస్తున్న వారిపైన నిరంతరంగా నిఘా పెడుతున్నామని, అక్రమాలకు పాల్పడితే వారిపైన క్రిమినల్ కేసు లు నమోదు చేస్తామని తెలిపారు.

పాఠశాలల సందర్శన

వేపాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వావిలపాడు ఎంపిపిఎస్ పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల బయాలజీ పరీక్షను పరిశీలించారు. అనంతరం వావిలపాడు పాఠశాలను సందర్శించి ఇంగ్లీషు, తెలుగు చదివించడం, విద్యార్థుల వర్క్ బుక్స్, టీచర్స్ డైరీ, పాఠశాల రికార్డులు, తరగతి గదులు, వంటగది, టాయిలెట్స్, పాఠశాల ఆవరణ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో పాఠశాల ఉపాధ్యాయులు జి.లక్ష్మి, బి.గౌరీ, సిఆర్‌పిలు రాంప్రసాద్, వి. సునంద పాల్గొన్నారు.



పరీక్షను పరిశీలిస్తున్న ఎంఇఒ భాస్కరరావు

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహశీల్దార్ పి.సుదర్శన రావు తెలిపారు. బుధవారం ఒమ్మిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, జనసేన నాయకులు అంబళ్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో తహశీల్దార్ సుదర్శన రావు మాట్లాడుతూ ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేణు, మండల సర్వేయర్ టి దివ్య, మానస, విఆర్ఒ మహేంద్ర, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని నల్లబెల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ జె.రాములమ్మ పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ముందుగా రెవెన్యూ సదస్సుల ఏర్పాటు చేయడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాల గూర్చి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఈ రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 16 దరఖాస్తులు స్వీకరించామని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సదస్సులో ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఉప తహశీల్దార్ డి సన్యాసినాయుడు, ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్, విఆర్వోలు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.




నెల్లిమర్ల: ఒమ్మిలో ర్యాలీ చేస్తున్న రెవెన్యూ అధికారులు, నాయకులు

శృంగవరపుకోట: భూ సమస్యలు పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని భూ సమస్యలు ఉన్నవారు వినతలు ఇవ్వాలని స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని తిమిడి గ్రామంలో తహశీల్దార్ అరుణ్ కుమారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. జనసేన నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాసి నాయుడు మాట్లాడుతూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి కీర్తన, డిటి భరత్, ఆర్ఐ మనోజ్ కుమార్, విఆర్ఒ రాంబాబు, అప్పలరాజు, సచివాలయ సర్వేయర్ పోతురాజు, ఎంపిటిసి పదాల ధర్మ, సర్పంచ్ త్రినాదమ్మ, వబ్బిన సతీష్, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

మెంటాడ: భూ సమస్యల పరిష్కారం చేయడం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తోందని తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొండలింగాలవలసలో సర్పంచ్ పాడి వరహాలమ్మ అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గజంగుడ్డివలస, శీలవలస గ్రామాలకు చెందిన రైతులు తమ భూమి సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌ను కోరారు. తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పది గ్రామ పంచాయతీల నుంచి ఇప్పటివరకు 112 వినతులు వచ్చాయని, కొన్ని సమస్యలను గ్రామ సభలోనే పరిష్కారం చేశామని, కొన్నింటిని పరిష్కారం చేయడం కోసం సమయం పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, మండల సర్వేయర్‌తో పాటు ఆయా గ్రామాల విఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని తహశీల్దారు డి.రాజేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని గరుడబిల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో చాలా కాలం నుంచి భూ సమస్యలున్నాయని వాటి ప్రక్షాళనకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ బొద్దల కృష్ణవేణి, మాజీ సర్పంచ్ తాడ్డి అప్పల నాయుడు, వైసిపి మండల కన్వీనర్ బొద్దల చిన్నం నాయుడు, టిడిపి మాజీ మండల అధ్యక్షులు శనపతి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ కొండపల్లి సురేసుబాబు, విఆర్ఒ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: తహశీల్దార్ చిన్నారావుకు వినతి పత్రాన్ని అందిస్తున్న రైతులు

భూ రీ సర్వే తక్షణమే చేపట్టాలి

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీలో రైతులు భూ సమస్యలపై ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే భూ రీ సర్వే చేపట్టాలని రైతులు నారు జనార్ధన రావు, బట్న తవిటినాయుడుతో పాటు మరికొంతమంది రైతులు రెవెన్యూ సదస్సులో వేడుకున్నారు. ఈ మేరకు బుధవారం సంకిలి సచివాలయ ఆవరణలో రైతు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ చిన్నారావు వినతి పత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరి పట్టాభి, విఆర్ఒ దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ, రైతులు ఉన్నారు.

రాజాం: మండలంలోని సారధి గ్రామంలో బుధవారం తహశీల్దార్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రెవెన్యూ సమస్యలపై రైతులకు సూచనలు, సలహాలు చేశారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించి వీటిని వెంటనే పీజిఆర్ఎస్ పోర్టల్‌లో అప్లోడ్ చేసి అర్జీదారులకు రసీదు ఇచ్చి ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోపు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

జనవరిలో పారిశ్రామిక సదస్సు
స్కిల్ కమిటీ సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో పండించే వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమల ఏర్పాటుకు యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా విధానాలను రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పండించే వరి, మామిడి, మొక్కజొన్న వంటి వ్యవసాయ ఉద్యాన ఉత్పత్తులను ఆధారం చేసుకొని పరిశ్రమలు ఏర్పాటు చేయడంపై జనవరి మొదటివారంలో పారిశ్రామిక సదస్సు నిర్వహించాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ఈ సదస్సు ద్వారా ఔత్సాహిక యువ పారిశ్రామిక వేత్తల్లో అవగాహన కలిగించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లా స్థాయి నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నైపుణ్య శిక్షణ పొందిన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం జిల్లాలోని మూడు డివిజన్ కేంద్రాల్లోనూ మెగా ఉద్యోగమేళాలు నిర్వహించాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనే ఆసక్తి వున్నవారికి పరిశ్రమలు నెలకొల్పడంపై శిక్షణ కార్యక్రమాలు నిపుణుల ద్వారా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ ప్రశాంత్ కుమార్, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, వ్యవసాయశాఖ డిడి అన్నపూర్ణ, ఎల్‌డిఎం రమణమూర్తి, ప్రభుత్వ ఐటిఐ కన్వీనర్ వివి గిరి, సిపిఒ పి.బాలాజీ, జిల్లా ఉపాధి కల్పన అధికారి అరుణ పాల్గొన్నారు.

బీచ్‌ల వద్ద గజ ఈతగాళ్ల ఏర్పాటు : కలెక్టర్

చింతపల్లి, చేపల కంచెరు, ముక్కాం బీచ్‌లలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మత్స్యశాఖ డిడికి ఆదేశించారు. చింతపల్లి మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధి లో నాలుగు బీచ్ లు ఉన్నాయని, ఆదివారాల్లో, మరి కొన్ని ప్రత్యేక దినాల్లో పర్యాటకులు ఎక్కువగా వస్తున్నందున గజ ఈతగాళ్ళు ఉండాల్సిన అవసరం ఉందని మెరైన్ ఎస్‌పి రవివర్మ కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ నెలలో 4 రోజులు బీచ్ ల వద్ద పని చేయడానికి గజ ఈతగాళ్లను గుర్తించాలని మత్స్యశాఖ డిడికి సూచించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. అత్యవసర రక్షణకు లైఫ్ జాకెట్స్ అవసరం ఉందని, అలాగే ఒక బోటు కూడా కావాలని మెరైన్ పోలీసులు కలెక్టర్‌ను కోరగా, లైఫ్ సేవింగ్ ఎక్విప్మెంట్ కోసం లేఖ ద్వారా రాస్తే సిఎస్ఆర్ కింద ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చింతపల్లి పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు కానీ గేటు ఏర్పాటు చేయలేదని సిఐ తెలపగా సమగ్ర శిక్ష ఇంజినీర్లను పిలిచి వెంటనే గేటును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తీర ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి వాటర్ స్పోర్ట్స్ కోసం అనువైన ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో మెరైన్ ఎస్.పి రవి వర్మ, జిల్లా అదనపు ఎస్.పి సౌమ్య లత, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, డిపిఒ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ డిడి నిర్మలా కుమారి, మెరైన్ పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిలతోనే తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- బాడంగి

ఇంటింటికీ కుళాయిలతోనే తాగునీటి సమస్య పరిష్కారమవుతోందని కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పల నాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఆయన ఎంపిడిఒ శంబంగి రామకృష్ణను కలిసి పలు సమస్యలపై చర్చించారు. మండలంలో అభివృద్ధి, సంక్షేమ పనుల గురించి చర్చించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా కోడూరు గ్రామంలో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఏర్పాటు అవశ్యకతను వివరించారు. గ్రామ ప్రజలు తాగునీటి కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామంలో శ్మశాన వాటికల వద్ద ప్రహరీలతోపాటు సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ సానుకూలంగా స్పందించినట్లు కొల్లి అప్పలనాయుడు తెలిపారు.

అనుమతి లేని భవనాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో అనుమతి లేని భవనాలపై చర్యలు తీసుకువాలని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నెల్లిమర్లలో అనుమతి లేకుండా కట్టిన బహుళ అంతస్థుల భవనంపై కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ స్థానిక మొయిద జంక్షన్ సినిమా హాల్ ఆవరణలో టౌన్ ప్లానింగ్ అనుమతి లేకుండా ఆరు అంతస్థుల భవనం కట్టడంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది బహుళ అంతస్థుల భవనం నిర్మాణ దశలో నిలుపుదల చేయకపోవడం వెనుక వారు కూడా నిర్లక్ష్యం వహించారాని అన్నారు. పేదలు ఇళ్ళు కట్టుకుంటే అనుమతి లేకుండా ఎలా కడతారని నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది అడ్డుకొని నిలుపుదల చేస్తున్నారని, అనుమతి లేకుండా పట్టణం నడిబొడ్డున కట్టిన బహుళ అంతస్థుల భవనాన్ని ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. అధికార్లు పేదవారికి ఒకలా,పెద్ద వారికి ఒకలా వ్యవహరించడం బావ్యం కాదన్నారు. నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు బొమ్మాలి వెంకట్, తుపాకుల రమణమ్మ అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నాయకులు రామారావు

మామిడి పంటల బీమా గడువు పెంపు

ప్రజాశక్తి- బాడంగి

మామిడి పంటకు బీమా ఈ నెల 31వ తేదీ వరకు పొడిగింపు చేశారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విహెచ్ఎ అనూష అన్నారు. బుధవారం ఆకులకట్ట పంచాయతీ ఆఫీస్‌లో ఉద్యాన శాఖ అధికారి మోహన్ కృష్ణ ఆదేశాల మేరకు రైతులతో సమావేశమయ్యారు. రైతులు ఒక ఎకరా మామిడి తోటకు రూ.2 వేలు ప్రీమియంగా చెల్లించాలని తెలిపారు. ఈనెల 31లోగా తమ ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, మామిడి సాగుకు సంబంధించిన భూమి సాగు పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని అన్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉయ్యాలా సత్యనారాయణ రైతులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మామిడి పంటలకు బీమా వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని స్థానిక ఉద్యానవన శాఖాధికారి మోహనకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో బుధవారం మామిడి రైతులతో ఆయన మాట్లాడారు. ఎకరా మామిడి పంటకు రూ.2వేలు ప్రీమియం చెల్లిస్తే రూ.40వేల వరకు బీమా వర్తిస్తుందని చెప్పారు. ఈ నెలాఖరువరకు ఈ అవకాశం ఉందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తుపాను నేపథ్యంలో కూరగాయల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కూరగాయ పంట పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు హైమావతి, విహెచ్ఎ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తం

ప్రజాశక్తి -గజపతినగరం

మండలంలోని గంగచోళ్లపెంట పొలాలను బుధవారం జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, సహాయ వ్యవసాయ సంచాలకులు మహారాజన్ సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ద్వారా అందించిన టార్పలిన్స్‌ను రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు నూర్చిన పంట మీద కప్పడం కోసం ఇవ్వడాన్ని గమనించారు. మరో రెండు రోజులు తుపాను కారణంగా వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు వరి కోతులు, నూర్పిండలు వాయిదా వేసుకోవాలని సూచించారు. కోసిన వరి పంటను వెంటనే చిన్న చిన్న కుప్పలుగా పెట్టుకోవాల న్నారు. ఇప్పటికే పంట నూర్పిడి చేసి, రాసులుగా ఉన్న ధాన్యాన్ని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఎఒ ధనలక్ష్మి, వ్యవసాయాదికారులు బి. లోకేష్ , విస్తరణ అధికారి సతీష్, వ్యవసాయ సహాయకులు పవన్, సర్పంచ్ సంగమయ్య, రైతులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : తుపాను కారణంగా వరి పంట కోతలు, నూర్పిడి వాయిదా వేసుకోవాలని ఎడిఎ ఎన్. కోటేశ్వరరావు సూచించారు. బుధవారం ఆయన ఎఒ ఎం.పూర్ణిమతో కలిసి కొండవెలగాడ, చంద్రంపేట గ్రామాలలో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడి కోటేశ్వరరావు మాట్లాడుతూ తుపాను హెచ్చరిక నేపథ్యంలో ఇప్పటికే కోసిన వరి పనలను కుప్పలుగా పెట్టుకోవాలన్నారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని బాటలు ద్వారా బయటకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ టి హేమామహేష్, విఎఎ వేణు బాబు, వసంత, రైతులు పాల్గొన్నారు.

డీలర్ నియామకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చామలాపల్లి గ్రామానికి శాశ్వత ప్రభుత్వ చౌక ధరల దుకాణం డీలర్ నియామకానికి ఆర్‌డిఒ ఉత్తర్వులు జారీ చేసినట్లు సిఎస్‌డిటి పి.రామకృష్ణ తెలిపారు. ఈ గ్రామానికి సంబంధించిన డీలర్‌ను ఒసి కోటాకు కేటాయించామన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించి, అదే గ్రామానికి చెందిన వారు అర్హులని తెలిపారు. ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

పోలీసుస్టేషన్‌ను సందర్శించిన డిఎస్‌పి రాఘవులు

ప్రజాశక్తి- గరివిడి రూరల్

స్థానిక పోలీసు స్టేషన్‌ను చీపురుపల్లి డిఎస్‌పి బి.రాఘవులు బుధవారం సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్ పరిసరాలు, రికార్డ్స్, కేసుల తాలూకా ఫైల్స్, పాపర్టీ, వివిధ కేసుల్లో పట్టుబడిన వెహికల్స్ పరిశీలించారు. సిబ్బంది పనితీరు తెలుసుకొని, స్టేషన్ డ్యూటీల గురించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ తనిఖీలలో చీపురుపల్లి సిఐ శంకరరావు, గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్‌టిసి బస్సు

ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి - వంగర

ప్రయాణికులను తమ గమ్యస్థానానికి సురక్షితంగా చేర్చవలసిన ఆర్‌టిసి బస్సు మార్గం మధ్యలో మొరాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని కొప్పర వెళ్ళవలసిన ఆర్‌టిసి బస్సు రాజాం కాంప్లెక్స్‌లో బుధవారం ఉదయం బయలుదేరి అరసాడ దాటిన తరువాత ఒక్కసారిగా మరమ్మతుకు గురి కావడంతో మార్గం మధ్యలోనే నిలిచిపోయింది. ప్రయాణికులంతా బస్సును వెనుక నుంచి నెట్టినప్పటికీ బస్సు స్టార్ట్ కాలేదు. దీంతో ఆ బస్సులో ఉన్న ప్రయాణికులంతా వారు వెళ్ళవలసిన గమ్యస్థానానికి వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. ఈ బస్సులో మండలంలో వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. బస్సు ఉదయం ఎనిమిది గంటల సమయానికి మొరాయించడంతో విధులకు వెళ్ళవలసిన ఉద్యోగులు వారు వెళ్ళవలసిన ప్రదేశాలకు సమయానికి వెళ్ళగలమో లేదో అని కొంత ఆందోళనకు గురయ్యారు. ఈ వారంలో మూడుసార్లు ఇదే బస్సు మొరాయించిందని ఇబ్బందులకు గురవుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు జోక్యం చేసుకొని బస్సులు మొరాయింపు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సును వెనుక నుంచి నెడుతున్న ప్రయాణికులు

బోరు బాగు చేయరూ...

వంగర: మండలంలోని అరసాడ మధ్య వీధిలో ఉన్న తాగునీటి బోరు మరమ్మత్తులకు గురి కావడంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ప్రజాశక్తికి తెలిపారు. అక్కడ ఉన్న తాగునీటి బోరు మరమ్మతులకు గురై చాలా రోజులు గడుస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయాన్ని సర్పంచ్‌కి చెప్పినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి బోరు బాగు చేయాలని అక్కడ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి కోటినను వివరణ కోరగా మెకానిక్‌లు శిక్షణ కార్యక్రమంలో ఉన్నారని గురువారం బాగు చేయిస్తామని తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

బొబ్బిలి: పాత బొబ్బిలి సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ దుప్పాడ ఉషారాణి (45) బుధవారం మృతి చెందారు. మూడు రోజుల క్రితం ఉషారాణి తన కుమారుడు విజయ్ చంద్‌తో కలిసి దత్తిరాజేరు మండలం మరడాం బంధువులు ఇంటికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా పాతబొబ్బిలి సాయి సర్వాణి లేఅవుట్ వద్ద గోతులలో ద్విచక్ర వాహనం దిగడంతో వెనుక కూర్చున్న ఉషారాణి పడిపోయి తీవ్రంగా గాయపడింది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మరణించినట్లు ఏఎస్ఐ భాస్కరరావు చెప్పారు.

5 లీటర్ల నాటు సారా స్వాధీనం

గుర్ల: ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఇందిరా దేవి ఆధ్వర్యంలో ఎస్ఐ రాజశ్రీ, సిబ్బంది బుధవారం మండలంలోని పకీరకిత్తలి గ్రామానికి చెందిన శిర్లపు ఈశ్వరరావుని 5 లీటర్ల నాటు సారాతో పట్టుకున్నారు. ఈయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సి నాగేశ్వరరావు, ఈసీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు సహకారం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆర్మీలో విధులు నిర్వహిస్తూ వీర మరణం పొందిన సైనికుల కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయ సహకారం ప్రభుత్వం తరపున అందిస్తామని రాజ్య సైనిక సంక్షేమ డైరెక్టర్ బ్రిగేడియర్ వి. వెంకటరెడ్డి (రిటైర్డ్) విఎస్ఎం అన్నారు. ఆయన బుధవారం బాడంగి మండలంలోని బోచ్చవానివలస గ్రామానికి చెందిన అమరు జవాన్ సియఫ్ఎన్ గొట్టాపు శంకర్రావు కుటుంబాన్ని, బొడ్డవలస గ్రామానికి చెందిన నాయక్ తేలు దినేష్ కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి చేతులు మీదగా వీర జవాన్‌ల భార్యలకు రూ.50వేలు, వారి తల్లిదండ్రులకు రూ.50 వేలు చెప్పున సాయుధ దళాల నిధుల నుంచి సైనిక సంక్షేమ శాఖ తరుపున చెక్ రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ రాజారావు, మాజీ జిల్లా సైనిక సంక్షేమ అధ్యక్షులు సబ్బన సతీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.